నాడు బాగుంది.. నేడు ఏమైంది?

- ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- అధికారంలోకి వచ్చి 8 నెలలవుతున్నా పాఠశాలల అభివృద్ధి శూన్యం
- నాడు–నేడు ఫేజ్–2 కింద రూ.16.60 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- 7.80 కోట్ల రూపాయల నిధులతో సగం పనులు పూర్తి
- కూటమి వచ్చాక నిధులివ్వక అర్ధంతరంగా నిలిచిన పనులు


మార్కాపురం జెడ్పీ బాలుర స్కూల్లో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

మార్కాపురం టౌన్:

పేద, మధ్య తరగతి పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలే పెద్ద దిక్కు. ఈ నేపథ్యంలోనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సర్కారు బడుల రూపురేఖలు మార్చడంతోపాటు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు చర్యలు చేపట్టింది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమం ఫేజ్–1, ఫేజ్–2 కింద కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించారు. అదే సమయంలో అమ్మ ఒడి పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు వేయడంతో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెరిగింది. విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన ఆహారం, విద్యా కానుక కిట్‌ను అందించి చదువుకునేలా గత ప్రభుత్వం ప్రోత్సహించింది.

కూటమి ప్రభుత్వంలో డీలా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 8 నెలలు అవుతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై దృష్టి సారించలేదు. పాఠశాలల్లో నాడు నేడు ఫేజ్–2 కింద చేపట్టిన నిర్మాణాలు సగానికిపైగా పూర్తి కాగా మిగిలిన పనులను పూర్తి చేసేందుకు ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా నిధులు కేటాయించలేదు. పైగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే కుట్రలకు కూటమి సర్కారు తెరతీసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మౌలిక వసతులపై లోపించిన శ్రద్ధ

గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు మంజూరు చేయడమే కాకుండా 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబుల పంపిణీ, డిజిటల్ బోధన, అధునాతన డిజిటల్ లైబ్రరీ, స్టూడెంట్ కిట్స్, టోఫెల్ శిక్షణ, ఐబీ సిలబస్ లాంటి సౌకర్యాలు కల్పించి కార్పొరేట్ స్థాయి విద్యను అందించారు. ప్రస్తుతం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించడం లేదు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ తల్లికి వందనం కింద రూ.15 వేల చొప్పున ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలనూ విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోలేని దుస్థితి. మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్లను సైతం బాగు చేయించకపోవడం, గత ప్రభుత్వం తలపెట్టిన అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లను పూర్తి చేయకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

రూ.8.80 కోట్లు ఎప్పుడిస్తారో?

మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల మండలాలు ఉన్నాయి. మొత్తం 287 పాఠశాలలు ఉండగా ప్రస్తుతం 27,105 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు ఫేజ్–2 కింద మార్కాపురం పట్టణ, మండల పరిధిలో మొత్తం 32 పాఠశాలలను ఎంపికచేశారు. అందులో 16.60 కోట్ల నిధులను కేటాయించగా సార్వత్రిక ఎన్నికల సమయానికి 7.80 కోట్ల నిధులు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు–నేడు కార్యక్రమానికి నిధులు నిలిపేయడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మిగిలిన మండలాల్లోనూ ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చంద్ర గ్రహణం పట్టిందని విద్యార్థుల తల్లిదండ్రులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.


మార్కాపురం జెడ్పీ బాలికల స్కూల్లో ఆగిపోయిన గదుల నిర్మాణం

పశువైద్య సిబ్బందిపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

బేస్తవారిపేట: పశువైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గత ఏడాదిన్నరగా వెటర్నరీ ఏడీ సమావేశానికి రావడం లేదని, పశువులకు బాగలేకపోయినప్పుడు ఇంజక్షన్ చేయించుకోవాలంటే ప్రైవేట్ వ్యక్తుల మీద ఆధారపడాల్సి వస్తోందన్నారు. గలిజేరుగుళ్ల పరిధిలోని పశువైద్య సిబ్బంది పశుపోషకులకు అందుబాటులో ఉండటం లేదన్నారు. డాక్టర్‌ను ఇంత వరకు చూడలేదన్నారు. అవసరమైన మందులు లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని పశువైద్యాధికారులు చెప్పగా ఎంపీపీ స్పందిస్తూ.. ఈ విషయం సభ దృష్టికి తీసుకొస్తే మండల పరిషత్ నిధులతో కొనుగోలు చేసి అందించేవాళ్లం కదా అని అన్నారు. పశువైద్యశాలల్లో మందుల స్టాక్ వివరాలు అందజేయాలని సూచించారు. టెరామైసిన్ మందు పశువైద్యశాలకు నాలుగే వచ్చాయని చెబుతున్నారని, పూర్తి స్థాయిలో మందులు లేకుండా ఉచిత పశువైద్య శిబిరాలు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారని, ప్రచారం చేయకుండా శిబిరాలు పెట్టడం ఏమిటని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


వెలుగు శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ ఓసూరారెడ్డి

వాటర్‌షెడ్ నిధులు లవ్లీహుడ్ కార్యాక్రమంలో వెలుగుకు 72 లక్షలు ఇచ్చినట్లు ఏపీఎం ఆనందకుమారి తెలిపారు. వాటర్‌షెడ్ గ్రామాల్లో 18 ఏళ్లుగా గ్రూప్ సభ్యులకు డబ్బులు ఇస్తున్నారని, రూపాయి వడ్డీ చొప్పున వడ్డీ ఎంత వచ్చింది, రికవరీ ఎంత ఉంది, ఎన్‌పీఏ ఎంత ఉందనే సమాచారం చెప్పాలని సభ్యులు కోరారు. సభ్యుల వద్ద, బ్యాంకుల వద్ద దాదాపు రూ.2 కోట్లు ఉందని, కొన్ని గ్రామాల్లో రికవరీ జరగలేదన్నారు. రూ.3.5 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఉండాలని, పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. కొత్త వీఓలను నియమించుకునేటప్పుడు నిబంధనలు ఎందుకు పాటించడంలేదని ప్రశ్నించారు. పచ్చిగడ్డి, సోక్ పిట్ల లబ్ధిదారులను పార్టీలకు అతీతంగా ఎంపిక చేయాలని, అన్‌లిమిటెడ్‌గా యూనిట్లు ఉన్నప్పుడు రాజకీయాలతో ముడిపెట్టవద్దని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్‌కు స్పష్టం చేశారు. కొత్త పథకాలు వచ్చినప్పుడు ప్రజాప్రతినిధులకు చెప్పడం లేదని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక దృఢత్వం


పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

మార్కాపురం: క్రీడలతో మానసిక దృఢత్వం వస్తుందని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కమల్‌షా పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నెహ్రూ యువ కేంద్రం, దీక్ష యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, స్లో సైక్లింగ్ పోటీలను హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధి శ్రీధర సాయిసుబ్బారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. క్రీడాకరుల మధ్య ఐక్యత ఉండాలన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

- న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్యాంబాబు


ఖైదీలతో మాట్లాడుతున్న కార్యదర్శి శ్యాంబాబు

మార్కాపురం: మార్కాపురం సబ్‌జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడుతూ.. ఎవరికైనా బెయిల్ పిటిషన్ వేసుకునే స్థోమత లేకుంటే మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందాలని సూచించారు. జైలులో ఖైదీలకు అందుతున్న సేవలు, భోజన వసతి, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట న్యాయవాదులు కడియం రామయ్య, ఎస్‌కే బాషా, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఉన్నారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పొదిలి: బీసీ కార్పొరేషన్ ద్వారా ఓబీఎంఎంఎస్‌లో భాగంగా ఉపాధి రుణాలు పొందేందుకు ఫిబ్రవరి 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. పోర్టల్ ద్వారా చేసుకున్న దరఖాస్తులను 8 నుంచి 11వ తేదీ వరకు పరిశీలిస్తామని, 12 నుంచి 14వ తేదీ వరకు అధికారులు సంయుక్త పరిశీలన చేపడతారని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం 21 నుంచి 23వ తేదీలోగా కలెక్టర్ వద్ద ఆమోదం తీసుకుంటామని, 28వ తేదీలోపు బ్యాంకు నుంచి రాయితీ విడుదల అవుతుందని తెలిపారు. మార్చి 6 నుంచి 9వ తేదీలోగా లబ్ధిదారులకు రుణం విడుదలవుతుందని చెప్పారు.

కల్లుగీత కార్మికులకు న్యాయం చేయండి


మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

మార్కాపురం: కల్లుగీత కార్మికులైన గౌడ్, గౌడ, గాండ్ల, గముళ్ల కులస్తులందరినీ గౌడ్‌గా పరిగణించి తమకు సర్టిఫికెట్ ఇస్తే మద్యం షాపులకు దరఖాస్తు చేసుకుంటామని గౌడ సంఘం నాయకులు ఐ.రంగస్వామి గౌడ్, జి.వెంకటేశ్వర్లు, డి.లక్ష్మయ్య తదితరులు బుధవారం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొన్ని ప్రాంతాల్లో తమ కులస్తులను రకరకాలుగా విభజించి గందరగోళం చేస్తున్నారని, ఈ నేపథ్యంలో ఐదు రకాల కులాల పేరుమీద సప్లిమెంటరీ సర్టిఫికెట్ ఇచ్చేలా తహసీల్దార్లను ఆదేశించాలని సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ప్రకాశం, నెల్లూరు, కృష్ణ, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కల్లుగీత కులాల్లో ఉన్న అందరినీ గౌడ్‌గా పరిగణించి సర్టిఫికెట్లు ఇవ్వాలని విన్నవించామన్నారు. కార్యక్రమంలో రంగారావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

4న మార్కాపురంలో రథసప్తమి వేడుకలు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఈఓ తదితరులు

మార్కాపురం టౌన్: స్థానిక శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో ఫిబ్రవరి 4వ తేదీన రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు యక్కలి కాశీ విశ్వనాథం, మున్సిపల్ మాజీ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున్, మాలపాటి వెంకటరెడ్డి, తాళ్లపల్లి సత్యనారాయణ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. స్వామివారు ఉదయం 5 గంటల నుంచి సూర్యప్రభ, శేషవాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్ప వృక్ష వాహనం, సాయంత్రం 5 గంటలకు వెండి రథంపై దర్శనమిస్తారని ఈఓ వివరించారు.

నయవంచనే చంద్రబాబు నైజం

- హామీలు అమలు చేయకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు
- ప్రజలను నమ్మించి మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ధ్వజం
- 'కూటమి' అప్పులు చేస్తే రాష్ట్రం శ్రీలంక కాదా అని ప్రశ్న



మార్కాపురం: బూటకపు హామీలు, మోసపూరిత మాటలతో గద్దెనెక్కడం, ఆపై గాలికొదిలేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు అలవాటుగా మారిందని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు గద్దెనెక్కిన 9 మాసాల్లోనే దాదాపుగా రూ.1.19 లక్షల కోట్లు అప్పు చేశారని, అయితే ఈ 9 నెలల్లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. చేసిన అప్పులతో ఎక్కడ సంపద సృష్టించారో చెప్పాలన్నారు. కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగిస్తున్నది నిజం కాదా అని నిలదీశారు. వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను నిర్మించాలని భావించి వాటిల్లో కొన్ని పూర్తి చేసిందన్నారు. మరికొన్ని కాలేజీలు నిర్మాణ దశలో ఉండగానే ఉద్దేశపూర్వకంగా నిలిపేసి, వాటిని కూటమి పార్టీలకు చెందిన వ్యక్తులకు కట్టబెట్టాలనే దుర్మార్గానికి సీఎం చంద్రబాబు ఒడిగట్టారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మీ నాయకుల కోసం ఇసుక, మద్యం, మట్టి, ఫ్లైయాస్ ఇలా దేన్నీ వదలకుండా దోచుకునే ప్రణాళికలు చేశారని విమర్శించారు. 2022 ఏప్రిల్ 5న ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని అన్నారని, దీనికి పవన్‌కల్యాణ్, పురందేశ్వరి కూడా వంతపాడి కేంద్ర ప్రభుత్వానికి సైతం ఫిర్యాదు చేశారన్నారు. గత ప్రభుత్వంలో అప్పులు చేస్తున్నారని గగ్గోలు పెట్టిన చంద్రబాబు ఇప్పుడు చేస్తున్నది ఏమిటి? అప్పులు కాదా? అని తూర్పారబట్టారు. ప్రతి మంగళవారం ఆర్‌బీఐ తలుపు కొడుతూనే ఉన్నారని, ఈ 9 నెలల కాలంలో ఏకంగా రూ.1.19 లక్షల కోట్లు అప్పు తెచ్చారని, దేనికి ఖర్చు పెడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రజలను వంచించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. బాబు మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు అంటున్నారన్నారు. ఇకనైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి కూటమి ప్రభుత్వం మాట నిలుపుకోవాలని హితవు పలికారు. లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి


గిద్దలూరులో బాలసదనాన్ని తనిఖీ చేస్తున్న బాలప్రభాకర్

కంభం: విద్యార్థులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా బాలల పర్యవేక్షణాధికారి పి.బాలప్రభాకర్ సూచించారు. గిద్దలూరు పట్టణంలోని మహిళా శిశు సంక్షేమశాఖ బాలసదనాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. తనిఖీ అనంతరం సంక్షరణ గృహాలకు లైసెన్స్ మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గిద్దలూరు సీడీపీఓ జ్యోతి, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు కే.శేఖర్ బాబు, శ్రీలక్ష్మి, బి.రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బాలికల హోమ్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

బాలికల హోమ్ తనిఖీ

బేస్తవారిపేట: మండలంలోని పీవీ పురంలో ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న నిర్మల్ బాలికల హోమ్‌ను డీపీఓ పి.బాలప్రభాకర్, ఐసీడీఎస్ సీడీపీఓ షేక్ నీలోఫర్ బేగమ్ బుధవారం తనిఖీ చేశారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు హోమ్‌ను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. సంరక్షణ, మౌలిక వసతులు, ఆరోగ్యంపై బాలికలను ఆరా తీశారు. తనిఖీ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా బాలల సంరక్షణాధికారులు కె.శేఖర్‌బాబు, ఐ.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పాత నేరస్తుల కదలికలపై నిఘా

- నేర సమీక్షలో డీఎస్పీ నాగరాజు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో పాత నేరస్తుల కదలికలపై పోలీసు అధికారులు నిఘా పెట్టాలని డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. దొంగతనాల నిరోధం, ప్రమాదాలు తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలన్నారు. మార్కాపురం, కంభం, గిద్దలూరు, దోర్నాల, యర్రగొండపాలెం, త్రిపురాంతకం తదితర పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాలన్నారు. పశ్చిమ ప్రకాశంలో గంజాయి లేకుండా చేయాలని, ఎవరైనా పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీ షీటర్లు ఏం చేస్తున్నారో నిత్యం గమనిస్తుండాలని చెప్పారు. సమీక్షలో మార్కాపురం, యర్రగొండపాలెం, కంభం, గిద్దలూరు సీఐలు సుబ్బారావు, ప్రభాకర్, మల్లికార్జున్, కోటయ్య, సురేష్‌బాబు, ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, రాజమోహన్‌రావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఆహ్వానం

బేస్తవారిపేట: జిల్లా స్థాయి క్విజ్ పోటీలు మార్కాపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7 నుంచి 10వ తరగతి విద్యార్థులు అర్హులని స్పష్టం చేశారు. క్విజ్ పోటీలు రెండు దశల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల నగదు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 95731 39996, 79897 96602ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని యడవల్లి హైవే క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. మోటరు సైకిల్‌పై మోటు జంక్షన్ నుంచి గిద్దలూరు వస్తున్న సమయంలో యడవల్లి క్రాస్ రోడ్డు వద్దకు రాగానే కుక్క అడ్డు వచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఆ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో గిద్దలూరులోని ఓ వైద్యశాలకు తరలించారు.

జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: మౌని అమావాస్య సందర్భంగా బుధవారం మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వర స్వామి సమేత జగదాంబ ఆలయంలో అమ్మవారికి, అల్లూరి పోలేరమ్మ తల్లికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కనకదార స్తోత్రం, శ్యామల నామార్చన, దుర్గ సహస్ర నామార్చన, మహా నైవేద్యం, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కంది పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు


కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు, పందిళ్లపల్లెలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కంది పంటను గుంటూరు లాంఫామ్, దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. కంది దిగుబడి ఏ మేరకు వస్తుందో అంచనా వేసేందుకు పంటను పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు. డిసెంబర్‌లో పడిన వర్షాలకు పూత రాలిపోయి నష్టపోయినట్లు రైతులు వివరించారు. బేస్తవారిపేట మండలంలో 2,227 మంది రైతులు 3,538 ఎకరాల్లో కంది సాగు చేయగా వర్షాల వల్ల భారీగా దెబ్బతింది. తనిఖీలో శాస్త్రవేత్తలు ఎన్.సాంబశివారెడ్డి, కేవీ శివారెడ్డి, పి.సంధ్యారాణి, జి.రమేష్, ఏడీఏ డి.బాలాజీనాయక్, ఏఓ జక్కం మెర్సీ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వీఆర్వోలు

గిద్దలూరు రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంస పత్రం అందుకున్న తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఆర్ఐ భాస్కరరావును బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రంగయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీ నాయబ్, వీఆర్వోలు రాజశేఖరరెడ్డి, రామయ్య, ఈశ్వరరెడ్డి, నాగేంద్రుడు, స్వర్ణలత, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి


కాట్రగుంటలో వైద్యం చేస్తున్న పశువైద్యాధికారి

కొనకనమిట్ల: పశువుల ఆరోగ్యంపై పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ కె.రాఘవయ్య సూచించారు. బుధవారం పెదారికట్ల, కాట్రగుంట గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. పశువుల పెంపకం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. గేదెలు, గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొట్లగట్టు, పెదారికట్ల పశు వైద్యాధికారులు వి.రాజ్యలక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, కాట్రగుంట సర్పంచ్ జి.మరియమ్మ లేవి, వైస్ ఎంపీపీ గొంగటి జెనీఫా కరుణయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కె.నాసరయ్య, బాలగురవయ్య, సహాయకులు పాల్గొన్నారు.